*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక (3.8.2002)*

# చివరకు మిగిలేది

"జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువ జన్మమృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి.

పుట్టిన దెల్ల గిట్టక మానదు. గిట్టినది మళ్ళీ పుట్టి తీరుతుంది. ఇది ప్రకృతి నియమం. తప్పనిది. తప్పించుకోలేనిది. అలాంటప్పుడు తప్పని సరైన మరణానికి దుఃఖించడం ఎందుకు?"

గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన మాటలు చెపుతున్నారు శాస్త్రిగారు.. అయినా ఇంటి యజమాని చనిపోతే ఆత్మీయులు, అయినవాళ్ళు దుఃఖించకుండా ఉంటారా!

ఆ వేళ మాస్టారు దివంగతులయ్యారు. మాస్టారు. ఇరవై రెండేళ్ళ వయసులో ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా చేరిన మనిషి అలా అలా ఎదిగి గర్ల్స్ హైస్కూలు హెడ్మాస్టరుగా ఎనిమిదేళ్ళ క్రితం రిటైరయ్యారు. అయినా, ఊళ్ళో వాళ్ళకింకా ఆయనమాస్టారే! ఎప్పుడూ ఏస్టూడెంటు దగ్గర్నించీ ట్యూషను డబ్బులు తీసుకోని మాస్టారు వేళకానివేళ ఇంటికి వచ్చినా ప్రతీ విద్యార్థికీ పక్షపాతం లేకుండా చదువు చెప్పిన మాస్టారు. మాస్టర్లకే మాస్టారు!

ఆదివారం. ఏకాదశి. పుణ్యదినం. పైగా టీచర్సుడే. మాస్టారు తన తుది రోజుని తానే ఎన్నుకున్నట్టు వెళ్ళిపోయారు. ఎంతగొప్ప మనిషి!

అరవై నాల్గేళ్ళలో ఎప్పుడూ జబ్బుపడి ఎరుగరు. ఏడాదిన్నర క్రితం మెడమీద చిన్న కంతిలా లేచింది. నెప్పి లేదని ఆయనంతగా పట్టించుకోలేదు. నెప్పి పెట్టేవాటికి అది టెన్నిస్ బాల్ అంత అయింది. చివరికి డాక్టర్లు కేన్సరన్నారు. ఏడాదిపాటు రేడియం ట్రీట్‌మెంట్ చేశారు. ఆయన నరకయాతన పడ్డారు.

రోజులు అతికష్టంగా గడుస్తున్నాయి. ఊళ్ళో అందరికీ తెలుసు. కాని ఇంత హఠాత్తుగా అంతిమఘడియ వస్తుందని మాత్రం చాలా మందికి తెలీదు.

ఆ వార్త విన్న వెంటనే ఆఘమేఘాల మీద పరుగెత్తుకు వచ్చాడు మూర్తి. ఒకప్పుడు ఆయన విద్యార్థి. తన కొడుకుని కూడా ఆయన వద్ద విద్యార్థిగా చేయగలిగనవాడు. సంతోషపడిన ఆత్మీయుడు!

మాస్టారు రిటైరైనా సాయంత్రం ఆరయితే చాలు నిత్యం హైస్కూలు గ్రౌండుకి వచ్చేవారు. అక్కడ కలిసిన వాళ్ళతో కబుర్లు చెప్పటం... వద్దు వద్దంటున్నా ఎవర్నో ఒకర్ని మోడ్రన్ కేఫ్‌కి లాక్కెళ్ళి టిఫిను పెట్టించడం ఊరందర్కీ తెలుసు.

ఇంటికి వచ్చినా అంతే! భోజనం చేసి వెళ్ళాల్సిందే! ఆ ఇంట్లో అడుగు పెట్టిన అతిథి ఖాళీ కడుపుతో గడప దాటడానికి వీల్లేదు!

అటువంటి మాస్టార్ని ఏడాదిన్నరగా ఇంటికి కట్టిపడవేసింది ఆ మాయదారి జబ్బు.

అప్పట్నించి అడపాదడపా ఆ ఇంటికి వచ్చి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూనే ఉన్నాడు మూర్తి.

మూడురోజుల క్రితం కూడా వచ్చాడు. పరిస్థితి దయనీయంగా ఉంది. ఇద్దరు మగపిల్లలు. చివర్న ఆడపిల్ల. ఏవేవో చిన్న ఉద్యోగాలు చేస్తున్నారు. కాని ఇంకా ఎవరికీ పెళ్ళి కాలేదు. జీవితాల్లో స్థిరపడలేదు.

ఎంతో మంచి మనిషి. ఎందరికో ఉపకారం చేసిన మనిషి. అటువంటిది నోరు విప్పి ఎప్పుడూ ఎవరినీ అడగలేదు. తన మనసులో బాధని చెప్పుకోలేదు. ఆయన కంటి చూపులే ఎన్నో అర్థాలు చెప్పేవి. రోగబాధ కన్నా తన బాధ్యతలు తీరలేదే అన్న వేదన ఆయన్ని ఎక్కువ క్రుంగదీసిందని మూర్తికి అనిపించేది.

భార్యాబిడ్డలు హృదయ విదారకంగా ఏడుస్తున్నారు. వాళ్ళని ఎలా ఓదార్చాలో ఎవరికీ తెలీటం లేదు. శిలాప్రతిమలా నిలబడిపోయాడు మూర్తి.

మాస్టారికి స్నేహితులకి కొదవలేదు. బంధువులకి తక్కువలేదు. వెళ్ళవల్సిన చోటుకి ఫోన్ కాల్స్ వెళ్ళాయి. వచ్చేపోయే జనంతో ఇల్లంతా నిండి ఉంది.

కర్మ జరిపించే శాస్త్రిగారొచ్చారు. దగ్గరి బంధువులు వచ్చారు. మరుసటి రోజు శవదహనానికి కావల్సిన ఏర్పాట్లు మొదలయ్యాయి.

"మాస్టారు ఎందరికో ఉపకారమే చేశారు కాని... ఏ ఒక్కడికీ అపకారం చేసి ఎరుగరు. అటువంటి గొప్ప మనిషికి రావల్సిన జబ్బు కాదు!" మూర్తి అందామనుకున్న మాటని అతనెవరో అన్నాడు.

"అవశ్యమను భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం - అన్నారు. మన కర్మ ఫలమే మనకు లభిస్తుంది.. వద్దన్నా పోదు. మరోటి రావాలన్నా రాదు. రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి ఎంతటి మహాత్ములు! అంతటి దైవస్వరూపులు కూడా రణబాధ నుంచి తప్పించు కోలేకపోయారు. అంతా ప్రారబ్ధకర్మ బాబూ!" అన్నారు శాస్త్రిగారు.

● ● ●

సోమవారం. తెల్లవారింది. రావల్సిన బంధువులు వచ్చేశారు. మాస్టారి భౌతిక కాయాన్ని శ్మశానానికి తీసుకుపోయే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఊళ్ళో అన్ని స్కూళ్ళ వాళ్ళకీ వార్త అందిపోయింది.

వీధి వీధంతా జనం. పెద్ద పెద్ద దండలతో మాస్టారి భౌతిక కాయాన్ని కప్పేశారు. ఆయన శరీరం పూలకొండలా ఉంది. ఈ ఊళ్ళో ఇంతమంది టీచర్లు ఉన్నారా? మూర్తి ఆశ్చర్యపోయాడు.

శాస్త్రిగారి సూచనల ప్రకారం పాడె పైకి లేచింది. వెనకనే తండోప తండాలుగా జనం. మూర్తి కూడా వాళ్ళో కలిసిపోయాడు. ఊరేగింపు శ్మశానం వైపుసాగింది.

మాస్టారి భౌతిక కాయానికి చితిపెట్టాక... అంతా దూరం దూరంగా నిలబడ్డారు.

మర్నాటి నుంచి జరగవల్సిన కర్మకాండకి ఎంత ఖర్చవుతుందని శాస్త్రిగారితో బంధువులు మంతనాలు జరిపారు. అలాంటి బేరాలు అక్కడ సాగటం ఎబ్బెట్టనిపించింది మూర్తికి. అయినా, ఎవరి ఈతిబాధలు వాళ్ళవి. ఈ వాస్తవిక ప్రపంచంలో డబ్బు గురించి మాట్లాడ కూడదని చోటంటూ ఎక్కడా లేదేమో!

ఇంతలో ఎవరో గుంపుగా మనుషులు శ్మశానంలోకి వచ్చారు. ఓ చతురస్రాకారం చుట్టూ గుమిగూడారు. వాళ్ళ బంధువుకి అంత్యక్రియలు జరిగిన చోటది. పిండ ప్రదానాలు అర్పించడానికి వచ్చారు. పిండాలు పెట్టి పోయిన వారి ఆత్మని ఆహ్వానిస్తూ దూరంగా వెళ్ళినిలబడ్డారు. మాస్టారి అంత్యక్రియలకు వచ్చిన వాళ్ళని కూడా ఎడంగా రమ్మని అర్థించారు. కాకులు రావాలని.. ఆ పిండాలు కతికి పోవాలని నానాతంటాలు పడ్డారు. కూతలు పెట్టారు. కేకలు పెట్టారు. తప్పట్లు కొట్టారు. అన్ని రకాలుగాను హైరాన పడ్డారు. ఒకటి రెండు కాకులుక్రిందకి దిగి వచ్చి పిండాల్ని కరచి కతికాక అమ్మయ్య అని తృప్తిపడి వెళ్ళిపోయారు.

నిజంగా కాకుల రూపంలో ఆత్మలు దిగి వస్తాయా? ఆహారాన్ని తీసుకుంటాయా? శరీరమే లేనప్పుడు ఆత్మలకి ఆకలి వేస్తుందా? మనిషి నమ్మకాలకీ విజ్ఞాన శాస్త్రానికీ ఎక్కడా పొత్తుండదు కదా! పరి పరి విధాల పోయాయి మూర్తి ఆలోచనలు.

అంతలోనే అర్భకుడొకడు అక్కడికి వచ్చాడు. శ్మశానంలో సగం ఆక్రమించుకున్న ఊడల

మర్రి చుట్టూ ప్రదక్షిణాలు చేసి దేనినో వెదుకుతున్నాడు. ఏమిటని ఆరా తీస్తే అంత క్రితం రోజునే ఆస్థికల్ని ఓ ముంతలో పెట్టి తానక్కడ భద్రంగా వ్రేలాడదీశాడట. ఇప్పుడెక్కడా కనిపించడం లేదని గోలుగోలుమంటున్నాడు.

ఆ ముతంలోని ఆస్థికలు అతని భార్యవట. అతన్ని చూస్తే అందర్కీ జాలేసింది. నలుగురు వెళ్ళి వెదికారు. అయినా దొరకలేదు. ఎవరయినా పట్టుకుపోయారేమోనంటాడు – ఆ అమాయకుడు. ఒకరి అస్థికలతో ఇంకొకరికి పనేముంటుంది?

చివరికెలాగో అతని భార్య చితి కాలిన చోట వెతకమని సలహా ఇచ్చారు. మాస్టారి అంత్యక్రియలకు వచ్చిన చాకలాడి చేతిలోంచి పార తీసుకుని ఓ చోట తవ్వాడతను. అరడుగు లోతుకు వెళ్ళినా అక్కడ మట్టి తప్ప మరేం కనిపించలేదు. మరో రెండు గజాలు దాటి తవ్వాడు. అక్కడా కనిపించలేదు. అతనలా వెర్రివాడిలా శ్మశానంలో తవ్వుకుంటూ పోతూంటే మూర్తికి అంత బాధాకరమైన వాతావరణంలోను నవ్వు వచ్చింది! ఎంత అమాయకులున్నారీ లోకంలో! చనిపోయిన భార్యకి పిండప్రదానాలు అర్పించి అస్థికల్ని ఏ గోదావరిలోనో కలపాలన్న మంచి ఆలోచన ఆ మనిషిలో ఉన్నదే కాని వాటిని భద్రంగా దాచుకోవాలన్న తెలివి, అంత్యక్రియలు జరిగిన చోటుని గుర్తుపట్టగల శక్తి అతనికి లేవు.

చివరికి అర్ధగంట అవస్థ పడ్డాక ఎలాగో ఆ చోటు పట్టుకొని తన భార్య అస్థికలు మరో ముంతలో కెత్తుకుని అతడు తృప్తిగా వెళ్ళిపోతుంటే అదేదో తానే సాధించినంతగా సంతృప్తి చెందాడు మూర్తి!

మరికాసేపటికి ఎవరో నలుగురు ఓ శవాన్ని మోసుకువచ్చారు. ఎవరెవరిని ఆరా తీస్తే పట్టుమని పన్నెండేళ్ళయినా లేని అనాథ పిల్ల శవం అని తెలిసింది. ఎందుకుచనిపోయిందో ఎవరికీ తెలీదు. ఎవరో దయకలవాళ్ళు అక్కడికి తీసుకువచ్చారు. అంత్యక్రియలకు కావాల్సిన కర్రల ఖర్చుకి చందాలు వేసి తెచ్చామని పంచాయతీ క్లర్కుకిచెప్పారు.

"నలుగురితో మంచిగా ఉండాలిరా! ఏదో ఒకనాడు ఆ నలుగురూ కావల్సి వస్తారు!" అని తన చిన్నప్పుడు తాతయ్య అంటూండేవాడు. అప్పుడు తనకర్థం కాలేదు. ఇప్పుడు ఎంతో నిజం అనిపిస్తోంది.

ఆ పిల్ల అనాథ. అయినా ఎప్పుడో పుణ్యం చేసుకుంది. అందుకే తనకేమీ కాని వాళ్ళు అంత్యక్రియలు చేసే మహాకార్యానికి పూనుకున్నారు. అద్వితీయమైన అనుభూతితో మూర్తికి ఒళ్ళు గరిపొడిచింది!

అప్పటికి మాస్టారి చితి భగభగ మండిపోతోంది. ఎర్రగా కణకణ లాడుతోంది తలభాగం. కపాలం పగిలిపోయాక అంతా స్నానాలు చేసి వెళ్ళిపోవచ్చుని చెప్పారు శాస్త్రిగారు.

ఆయన ఎవర్నో సిగరెట్టు అడిగి కాలుస్తుంటే తెల్లబోయాడు మూర్తి. ఉండబట్టలేక "మీరు సిగరెట్టు కాలుస్తారా!" అన్నాడు ఆశ్చర్యపోతూ.

శాస్త్రిగారు నవ్వాడు. "రోజూ ఎందరికో పురుళ్ళు పుణ్యాలు జరుగుతాయి. ఒడుగులు,

పెళ్ళిళ్ళు జరుగుతాయి. పండగలు, పబ్బాలు జరుగుతాయి. శుభకార్యాలన్నీ ఇళ్ళలోనో, గుళ్ళలోనో జరుపుకుంటారు. పందిట్లోనో పార్టీల్లోనో జరుపుతుంటారు.కాని, అందరికీ అంత్యక్రియలు జరిగేది మాత్రం ఇక్కడొక్కచోటే! అక్కడ కాటికాపరి, ఇక్కడ కర్మచేసే నేను... మా బ్రతుకులు మాత్రం ఇక్కడే గడిచిపోతాయి. ఇది మా వృత్తి ధర్మం కావచ్చు. మేమూ మనుషులమేగా! గుండె దిటవు చేసుకోవాలంటే వాడికి కల్లు, నాకీ సిగరెట్టు ముక్క తప్పవు..."

నిజమేననిపించింది మూర్తికి.

"ఇక్కడికి వచ్చే చుట్టాలు దుఃఖపడుతూ వస్తారు. కాసేపు పాప పుణ్యాల గురించి ఆలోచిస్తారు. శ్మశాన వైరాగ్యం అదీ కాసేపు... ఇంటికి వెళ్ళాక మళ్ళీ అంతా మామూలే! ఇవన్నీ మర్చిపోతారు. కాదంటావా?"

"నిజమే!" మూర్తి పెదవులు తడారిపోయాయి.

"ఓ విధంగా చెప్పాలంటే మర్చిపోవాలి కూడా! లేకపోతే జీవితాలు ముందుకు నడవ్వు. ఎటొచ్చీ మన జీవిత పరమావధి ఏమిటి అన్న ఆలోచన వస్తే చాలు. ఇక్కడికి వట్టి చేతులతో వచ్చాం. వెళ్ళేటప్పుడు వెంట ఏమీ తీసుకుపోము. కాని ఇక్కడ వదిలిపోయేది మాత్రం ఓటుంది. అదే మనం చేసే మంచి!"

మాస్టారి చితిలో మంటలు ఆరిపోతున్నాయి. ఆత్మబంధువులంతా నూతి దగ్గరికి వెళ్ళిస్నానాలు చేస్తున్నారు.

పంచాయతీ క్లర్కుకి పాతిక రూపాయలు మామూలివ్వమని మాస్టారి తమ్ముడికి చెప్పాడు శాస్త్రిగారు.

అందులో ఉచితానుచితాల ప్రశ్న లేదు. అక్కడ నిత్యం జరిగేదే! ఇప్పించమన్నవాడికి కొత్త కాదు. ఇచ్చేవాళ్ళకి వింత కాదు. పుచ్చుకునే వాడికి విడ్డూరమూ కాదు.

కాని ఎప్పుడూ జరగని విడ్డూరం ఇప్పుడు జరిగింది! "మాస్టారి దగ్గరచిన్నప్పటినుంచీ చదువుకున్నాను. డబ్బుచ్చుకొని పాపం మూటగట్టుకోలేను" అన్నాడు పంచాయతీ క్లర్కు ఎర్రబడిన ముఖంతో.

అనిర్వచనీయమైన ఆనందంతో మూర్తికి ఒళ్ళు పులకరించింది.

"ఇక్కడ మాస్టారు వదలిపోయిన మంచి ఆయన మిగిల్చిపోయిన బాధ్యతల్ని తప్పకుండా నిర్వర్తించేలా చేస్తుంది!" ప్రగాఢ విశ్వాసంతో హాయిగా నిట్టూర్చాడు మూర్తి.

"మాస్టారు అదృష్టవంతులు. ఆయన పోతే ఊరు ఊరంతా కదిలి వచ్చింది" ఆయన శవానికి చితి పెట్టటానికి కొడుకులున్నారు. కర్మ జరిపించటానికి నేనున్నాను. మరి నేను పోయినప్పుడు... నాకు చితిపెట్టే కొడుకూ లేడు. ఊళ్ళో కర్మ జరిపించడానికి మరో బ్రాహ్మడూ లేడు!" అని నవ్వాడు శాస్త్రిగారు.

ఊరివాళ్ళకెంతో సేవ చేసే శాస్త్రిగారికి ఎవ్వరూ లేరా! జీవితం ఎంత చిత్రమైనది? మూర్తి మనస్సు చివుక్కుమంది! ●